సాక్షి సూర్యాపేట

ఆదివారం। 9। జూన్। 2024



ట్రిపుల్ ఐటీ పిలుస్తోంది!
నిర్మల్ జిల్లా బాసర ట్రిపుల్ ఐటీలో ఆరేళ్ల బీటెక్ సమీకృత కోర్సులో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదలైంది. - 8లో



యాదాద్రిలో భక్తుల రద్దీ
యాదాద్రిలో శనివారం భక్తుల రద్దీ నెలకొంది. 35వేల మందికిపైగా భక్తులు శ్రీస్వామిని దర్శించుకున్నారు. - 8లో

గరిష్ఠం/కనిష్ఠం 33°/ 26°

వాతావరణం
ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడ ఉరుములతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నేడు, రేపు ఉత్తమ్ పర్యటన

హుజూర్‌నగర్/కోదాడరూరల్ : రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి హుజూర్‌నగర్ నియోజకవర్గంలో ఆది, సోమవారం పర్యటించనున్నట్లు మంత్రి పీఆర్‌ఓ వెంకటరెడ్డి శనివారం ఒక ప్రకటనలో వెల్లడించారు. 9వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు హుజూర్‌నగర్ పట్టణంలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో హుజూర్‌నగర్, కోదాడ నియోజకవర్గాల ఆర్ అండ్ బీ, పంచాయతీ రాజ్, విద్యుత్ శాఖల అధికారులతో సమీక్ష ఉంటుందని తెలిపారు. సాయంత్రం 5 గంటలకు పట్టణ శివారులోని రామస్వామి గుట్ట వద్ద హౌసింగ్ కాలనీ పనులను పరిశీలిస్తారని పేర్కొన్నారు. 10వ తేదీ మధ్యాహ్నం 12 గంటలకు కోదాడలో షాదీఖానా స్థల పరిశీలన అనంతరం 2 గంటలకు కోదాడలోని గుడుగుంట్ల అప్పయ్య ఫంక్షన్ హాల్‌లో హుజూర్ నగర్ - కోదాడ నియోజక వర్గాల ఎత్తిపోతల పథకాలపై ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం ఉంటుందని తెలిపారు. కోదాడలో జరిగే సమీక్షకు ఎమ్మెల్యే పద్మావతి కూడా హాజరుకానున్నట్లు పేర్కొన్నారు.

నేడు గ్రూప్-1 ప్రిలిమ్స్



సాయిగౌతమి జూనియర్ కాలేజీలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ ప్రియాంక

భానుపురి (సూర్యాపేట) : తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్ -1 ప్రిలిమినరీ పరీక్షకు అంతా సిద్ధమైంది. ఆదివారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించే ఈ పరీక్ష కోసం సూర్యాపేట పట్టణంలో 32 కేంద్రాలు ఏర్పాటు చేశారు. 9,725 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నారు. ఉదయం 8గంటల నుంచి పరీక్ష కేంద్రాల్లోకి అభ్యర్థులను పంపి 9గంటల నుంచి బయోమెట్రిక్ అమలు చేయనున్నారు. ఇక 10గంటల తర్వాత లోనికి అనుమతించరు.

ఏర్పాట్లను పరిశీలించిన అదనపు కలెక్టర్

గ్రూప్-1 పరీక్షకు సంబంధించి సూర్యాపేట పట్టణంలోని సాయిగౌతమి జూనియర్ కళాశాలలో ఏర్పాట్లను అదనపు కలెక్టర్ సీహెచ్.ప్రియాంక శనివారం పరిశీలించి మాట్లాడారు. పరీక్ష సమయంలో నిరంతరం విద్యుత్, మంచినీరు ఉండేలా జాగ్రత్త పడాలన్నారు. సీసీటీవీ కెమెరా ముందు పరీక్ష పత్రాలను ఓపెన్ చేయాలన్నారు. తిరుమలగిరి, తుంగతుర్తి, కోదాడ, హుజూర్‌నగర్ ప్రాంతాల నుంచి ఆర్టీసీ బస్సుల సదుపాయం కల్పించామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్వీ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్, రీజనల్ కోఆర్డినేటర్ వెంకటేశం, ప్రిన్సిపల్ వై.లక్ష్మయ్యగౌడ్ పాల్గొన్నారు.

అడ్వకేట్ జేఏసీ కార్యదర్శిగా బాలాజీనాయక్

మఠంపల్లి: మఠంపల్లి మండలం గుర్రంబోడు తండాకు చెందిన హైకోర్టు అడ్వకేట్ ఇస్లావత్ బాలాజీనాయక్‌ను తెలంగాణ రాష్ట్ర అడ్వకేట్ జేఏసీ కార్యదర్శిగా నియమిస్తూ ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాగుల శ్రీనివాస్‌యాదవ్ ఉత్తర్వులు అందజేశారు. శనివారం బాలాజీ నాయక్ స్థానికంగా విలేకరులతో మాట్లాడారు. గుర్రంబోడుభూముల పరిరక్షణకోసం చేస్తున్న సేవలను గుర్తించి తనకు ఇచ్చిన ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకుని వారి సంక్షేమానికి కృషి చేస్తానన్నారు.

మట్టపల్లిలో గరుడ వాహన సేవ



గరుడవాహనంపై ఊరేగుతున్న శ్రీస్వామి అమ్మవారు

మఠంపల్లి: మట్టపల్లి క్షేత్రంలో శ్రీరాజ్యలక్ష్మి చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీ నరసింహస్వామి నిత్యకల్యాణాన్ని అర్చకులు వేదమంత్రోచ్ఛరణలతో శని వారం విశేషంగా నిర్వహించారు. ఆలయంలో సుప్రభాతసేవ, ప్రాతఃకాలార్చన, నిత్య హోమం, మూల విరాట్ స్వామికి పంచామృతాభిషేకం చేపట్టారు. అనంతరం శ్రీస్వామి అమ్మవార్లను నూతన పట్టువస్త్రాలతో వధూవరులుగా అలంకరించి ఎదుర్కోళ్ల మహోత్సవం నిర్వహించారు. కల్యాణవేడుకలో భాగంగా విష్వక్సేనారాధన , రక్షాబంధనం, రుత్విగ్వరణం, పంచగవ్యప్రాశన, మధుపర్కపూజ, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర కార్యక్రమాలు పూర్తిగావించారు. అనంతరం శ్రీస్వామి అమ్మవార్లను గరుడవాహనంపై ఆలయ తిరుమాడ వీధుల్లో ఊరేగించారు. ఆలయ ప్రవేశానంతరం నీరాజన మంత్ర పుష్పాలతో మహానివేదన గావించారు.

● చేపలకు ఫుల్ డిమాండ్





మృగశిర కార్తె సందర్భంగా శనివారం కొనుగోలు దారులతో సందడిగా మారిన సూర్యాపేటలోని చేపల మార్కెట్

కాంగ్రెస్ ఖాతాలోకి..

- వరంగల్ - ఖమ్మం - నల్లగొండ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానం తొలిసారి హస్తగతం
- ఎమ్మెల్సీ స్థానం ఏర్పడిన నాటి నుంచి బీఆర్‌ఎస్ ప్రాతినిధ్యమే
- ఈ ఉప ఎన్నికలో కైవసం చేసుకున్న కాంగ్రెస్ పార్టీ
- రెండుసార్లు ఎమ్మెల్సీ స్థానానికి, ఒకసారి ఎమ్మెల్యే సీటుకు పోటీచేసి ఓడిన మల్లన్న
- నాలుగో ప్రయత్నంలో చట్టసభలోకి అడుగు



సాక్షి ప్రతినిధి, నల్లగొండ : వరంగల్ - ఖమ్మం - నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానం ఎట్టకేలకు కాంగ్రెస్ ఖాతాలో చేరింది. శాసనమండలి ఏర్పాటైన తర్వాత ఈ నియోజకవర్గానికి ఐదుసార్లు ఎన్నికలు జరిగాయి. అందులో నాలుగుసార్లు బీఆర్ఎస్ పార్టీనే ఎమ్మెల్సీ స్థానాన్ని కైవసం చేసుకోగా.. ఐదోసారి జరిగిన ఈ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ దక్కించుకుంది.

నాలుగుసార్లు బీఆర్ఎస్ అభ్యర్థులే..

దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రి అయిన తరువాత 2007లో శాసన మండలి వ్యవస్థను తిరిగి ప్రారంభించారు. వరంగల్ -ఖమ్మం-నల్లగొండ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీగా తొలిసారి టీఆర్ఎస్ పార్టీ నుంచి కపిలవాయి దిలీప్‌కుమార్ ఎన్నికయ్యారు. మొదటిసారి డ్రా పద్ధతిన పదవీకాలాన్ని నిర్ణయించారు. అప్పట్లో దిలీప్‌కుమార్‌కు రెండేళ్ల పదవీకాలం దక్కింది. ఆ తరువాత 2009లో జరిగిన ఎన్నికల్లోనూ కపిలవాయి దిలీప్‌కుమార్ విజయం సాధించారు. ఆరేళ్ల తరువాత 2015లో తెలంగాణ వచ్చాక మళ్లీ ఎన్నికలు జరిగాయి. అందులో టీఆర్ఎస్ నుంచి పల్లా రాజేశ్వర్‌రెడ్డి గెలుపొందారు. మళ్లీ 2021లో జరిగిన ఎన్నికల్లో కూడా బీఆర్ఎస్ నుంచి పల్లా రాజేశ్వర్‌రెడ్డి విజయం సాధించారు.

మొదటిసారి కాంగ్రెస్ విజయం

పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి గతంలో నాలుగు సార్లు ఎన్నికలు జరిగాయి. 2021లో గెలిచిన పల్లా రాజేశ్వర్‌రెడ్డి పదవీ కాలం 2027 వరకు ఉంది. అయితే ఆయన 2023 నవంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో జనగామ నుంచి ఆయన ఎమ్మెల్యేగా గెలుపొందడంతో ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేశారు. దీంతో ఈ ఏడాది మే 27వ తేదీన పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి ఉప ఎన్నిక నిర్వహించారు. అందులో కాంగ్రెస్ నుంచి తీన్మార్ మల్లన్న, బీఆర్ఎస్ నుంచి ఏనుగుల రాకేశ్‌రెడ్డి, బీజేపీ నుంచి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి పోటీ చేశారు. ఈ ఎన్నికల ఫలితాలు శుక్రవారం వెల్లడయ్యాయి. అందులో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మల్లన్న విజయం సాధించడంతో నియోజకవర్గ చరిత్రలో మొదటిసారి ఈ స్థానం కాంగ్రెస్ పార్టీ ఖాతాలోకి చేరింది.

పక్కా వ్యూహంతో గెలిచిన మల్లన్న

రెండుసార్లు ఎమ్మెల్సీ స్థానానికి, ఒకసారి ఎమ్మెల్యే స్థానానికి పోటీచేసి ఓడిపోయిన తీన్మార్ మల్లన్న.. నాలుగో ప్రయత్నంలో విజయం సాధించారు. 2015లో వరంగల్ -ఖమ్మం - నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసి ఓడిపోయారు. ఆ తరువాత 2019లో హుజూర్‌నగర్ అసెంబ్లీ స్థానానికి జరిగిన ఉప ఎన్నికలో స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేసి ఓటమి పాలయ్యారు. ఇక 2021లో జరిగిన వరంగల్-ఖమ్మం-నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేశారు. ఆ ఎన్నికల్లో మల్లన్న ఓడిపోయినా బీఆర్ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డికి గట్టి పోటీ ఇచ్చారు. ఆ ఎన్నికల్లో రాజేశ్వర్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓట్లు 1,10,840 రాగా, మల్లన్నకు 83,290 ఓట్లు, టీజేఎస్ అభ్యర్థి కోదండరామ్‌కు 70,072 ఓట్లు వచ్చాయి. చివరకు రాజేశ్వర్‌రెడ్డి రెండో ప్రాధాన్యత ఓట్లతో విజయం సాధించారు. ప్రస్తుతం అదే స్థానానికి జరిగిన ఉప ఎన్నికల్లో మల్లన్న పక్కా వ్యూహంతో విజయం సాధించారు.

పెండింగ్ కేసుల పరిష్కారానికే లోక్ అదాలత్

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి గోవర్ధన్ రెడ్డి



లోక్ అదాలత్‌లో పాల్గొన్న జిల్లా జడ్జి గోవర్ధన్‌రెడ్డి, న్యాయమూర్తులు



లోక్ అదాలత్‌లో ఒక్కటైన పలు జంటలు

చివ్వెంల(సూర్యాపేట) : కోర్టుల్లో పెండింగ్ కేసుల సత్వర పరిష్కారం కోసమే జాతీయ మెగాలోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్. గోవర్ధన్ రెడ్డి అన్నారు. శనివారం సూర్యాపేట జిల్లా కోర్టు ప్రాంగణంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ మెగాలోక్ అదాలత్‌లో మాట్లాడారు. ఒక్కసారి లోక్ అదాలత్‌లో పరిష్కారమైన కేసులు భవిష్యత్‌లో అప్పీల్‌కు వెళ్లే అవకాశం ఉండదన్నారు. గ్రామాల్లో చిన్న చిన్న ఘర్షణలకు కోర్టు మెట్లు ఎక్కకుండా పెద్ద మనుషుల సమక్షంలో పరిష్కరించుకోవాలన్నారు. దీని వల్ల కాలం, ధనం వృథా కాకుండా ఉంటుందన్నారు. యువత చెడు వ్యవసనాలకు దూరంగా ఉండాలన్నారు. కొన్ని సంవత్సరాలుగా విడాకులు, గృహహింస కేసుల్లో కోర్టుల చుట్టూ తిరుగుతున్న పలువురు భార్యభర్తలు లోక్ అదాలత్‌లో ఒక్కటయ్యారు. వారు కోర్టులోనే న్యాయమూర్తుల సమక్షంలో దండలు మార్చుకొని కలిసిపోయారు. జిల్లా కోర్టు ప్రాంగణంలో నిర్వహించిన లోక్ అదాలత్‌లో పలు సివిల్, క్రిమినల్, బ్యాంకు, వెహికిల్ యాక్టు, విద్యుత్, వంటి వి 2,343 కేసులు పరిష్కారం అయ్యాయి.


9,060 కేసులు పరిష్కారం

జిల్లాలోని సూర్యాపేట, కోదాడ, హుజూర్‌నగర్, తుంగతుర్తిలో నిర్వహించిన లోక్‌అదాలత్‌లో 9,060 కేసులు పరిష్కరించారు. కేసుల పరిష్కారంలో రాష్ట్రంలో జిల్లాకు నాలుగో స్థానం లభించింది. ఈ కార్యక్రమంలో జిల్లా మొదటి అదనపు న్యాయమూర్తి శ్యామ్‌శ్రీ, సీనియర్ సివిల్ జడ్జి పి.శ్రీవాణి, జూనియర్ సివిల్ జడ్జి కె.సురేష్, అదనపు జూనియర్ సివిల్ జడ్జి జె.ప్రశాంతి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నూకల సుదర్శన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి డపుకు మల్లయ్య, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

మన.. చద్దన్నం

- మారుతున్న ఆహారపు అలవాట్లు
- చద్దన్నం తినేందుకు మొగ్గుచూపుతున్న జనం
- ప్రజల అభిరుచి మేరకు వెలుస్తున్న చద్దన్నం స్టాల్స్

పెద్దల మాట.. చద్ది మూట. చద్దన్నం ప్రాముఖ్యతను తెలియజేస్తుంది ఈ మాట. 'చద్దన్నం తిన్నందుకే ఇంత సత్తువతో ఉన్నం' అని పెద్దలు చెప్తుంటారు. చద్దన్నం శరీరంలో వేడిని తగ్గించడంతో పాటు రోగనిరోధక శక్తిని పెంచుతుంది. కడుపులో అల్సర్లు రానీయదు. అందుకే మన పూర్వీకులు సంపూర్ణ ఆరోగ్యంగా జీవించే వారు. ఇప్పుడు మళ్లీ ఆ ఆహారపు అలవాట్ల వైపు జనం మళ్లుతున్నారు. - రామగిరి (నల్లగొండ)



మారిన జీవన విధానం, పాశ్చాత్య సంస్కృతి ప్రవేశంతో పాతతరం ఆహారపు అలవాట్లు మారిపోయాయి. పూర్వం రాత్రివేళ ఎవరైనా అనుకోని అతిథి వస్తారేమో నన్న ముందు జాగ్రత్తతో అన్నం ఎక్కువగా వండేవారు. ఎవరూ రాకపోతే అది మిగిలి మరుసటి రోజు సద్దన్నంగా మారిపోయేది. ఆ అన్నాన్ని ఉదయాన్నే తినేవారు. ఇప్పుడు ఏ పూటకు సరిపడేంత.. ఆ పూటే వండుకోవడం అలవాటుగా మారింది. కానీ, కరోనా మహమ్మారి చాలామందిని మళ్లీ ఆనాటి ఆహారపు అలవాట్లవైపు తిప్పింది. చద్దన్నంతో రోగ నిరోధక శక్తి పెరుగుతుందని నిపుణులు సూచించడంతో ఇప్పుడు చద్దన్నం తినేందుకు ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. అమెరికాలోనూ మన తెలుగువారు 10 నుంచి 12 డాలర్లు వెచ్చించి చద్దన్నం కొనుగోలు చేసి తింటున్నారు. ఇప్పుడు మన దగ్గర కూడా చద్దన్నం విక్రయానికి స్టాల్స్ వెలుస్తున్నాయి.

సండే స్పెషల్




చద్దన్నం తింటున్న వాకర్స్

చద్దన్నం తినేందుకు ఆసక్తి..

ప్రజలు చాలా మంది ఇప్పుడు చద్దన్నం ఎక్కువగా తింటున్నారు. పట్టణాల్లో కొందరు తమ ఇళ్లలో రాత్రి మిగిలిన అన్నంలో పాలు పోసి తోడు వేసుకుని ఉదయాన్నే టిఫిన్‌గా ఆ ఆహారాన్ని తీసుకుంటున్నారు. ఇలా మారుతున్న ఆహారపు అలవాట్లకు అనుగుణంగా చద్దన్నం అమ్మేందుకు స్టాల్స్ కూడా ఏర్పాటవుతున్నాయి. నల్లగొండ పట్టణంలో ఎన్జీ కళాశాల వద్ద ఇటీవల రెండు చద్దన్నం స్టాల్స్ వెలిశాయి. జొన్నలు, బ్రౌన్‌రైస్, అరికెలు, సజ్జలు ఇలా నాలుగు రకాల చద్దన్నం తయారు చేసి విక్రయిస్తున్నారు. ఉదయం వేళ ఈ స్టాల్స్ వద్ద జనం క్యూ కడుతున్నారు.

చద్దన్నం.. ప్రయోజనాలు

- పచ్చ జొన్నలు రొట్టె, గట్క రూపంలో తీసుకోవడం కంటే జొన్నలు చద్దన్నంగా చేసుకొని తింటే అద్భుతమైన ఆరోగ్య ఫలితాలు ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. జొన్న చద్దన్నం రోజూ తినడం వల్ల మధుమేహం (షుగర్) సహజంగా తగ్గుతుంది. ఇందులో ఐరన్, క్యాల్షియం, విటమిన్స్ అధికంగా ఉండటంతో శరీరాన్ని అనారోగ్యం బారి నుంచి కాపాడుతుంది.
- బ్రౌన్ రైస్ చద్దన్నంలో తక్కువ కాలరీస్, ఎక్కువగా ఫైబర్ ఉండడం వల్ల ఊబకాయం (ఒబెసిటీ) తగ్గుతుంది. దీనిలో ఉండే విటమిన్ బి6 రక్తహీనతను తగ్గిస్తుంది. చక్కెర స్థాయిని నియంత్రిస్తుంది. గుండె సంబంధ సమస్యలు కూడా తగ్గుతాయి.
- రాగి చద్దన్నం అధిక ఆకలిని నియంత్రిస్తుంది. ఎదిగే పిల్లలకు రోజూ ఆహారంలో ఇస్తే శరీరం దృఢంగా తయారవుతుంది. చర్మాన్ని కాంతివంతంగా ఉంచుతుంది. కాలేయంలోని అదనపు కొవ్వును, శరీరంలో చెడు కొలెస్ట్రాల్ స్థాయిని తగిస్తుంది.
- అరికెల చద్దన్నంతో మూత్రపిండ వ్యాధులు, ఇన్‌ఫెక్షన్, కిడ్నీ స్టోన్, మూత్రనాళ సమస్యలు తగ్గుతాయి. శరీరంలో రక్తాన్ని శుభ్రపరిచి మలినాలను తొలగిస్తుంది. ఎర్రరక్త కణాలను వృద్ధి చేస్తుంది. డయాలసిస్ పేషంట్స్‌కు మంచి ఫలితాలను ఇస్తాయి.



ఆయుష్షు పెంచుతుంది



రోజూ చద్దన్నం తీసుకోవడం వల్ల ఆయుష్షు పెరుగుతుంది. పూర్వం పెద్దవాళ్లు ప్రతిరోజూ చద్దన్నం తినడం వల్ల ఎలాంటి రోగాలు లేకుండా 100 నుంచి 120 ఏళ్లు ఆరోగ్యంగా బతికారు. ఇప్పుడు అనేక వ్యాధులు, రోగాలతో ప్రతి ఒక్కరూ బాధపడుతున్నారు. అందుకే అమృతం లాంటి చద్దన్నం నేటి సమాజానికి మళ్లీ పరిచయం చేసి ప్రజలను ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దడానికే నేను 'మన చద్దన్నం' స్టాల్‌ను ఏర్పాటు చేశాను.

-కందుల యాదగిరి, మన చద్దన్నం స్టాల్ నిర్వాహకుడు

షుగర్ లెవల్స్ తగ్గాయి



నేను షుగర్ వ్యాధితో బాధపడుతున్నాను. చద్దన్నం తిన్న తర్వాత షుగర్ లెవల్స్ పడిపోయాయి. మందులు అవసరం లేకుండా ఆరోగ్య సమస్యలు దూరం అవుతాయి. అందుకే ప్రతి రోజూ క్రమం తప్పకుండా చద్దన్నం తింటున్నా.

-అలిమొద్దీన్

సన్నాలు సాగు చేయండి

- సన్నాలకు మార్కెట్‌లో మంచి డిమాండ్
- బోనస్‌పై మార్గదర్శకాలు ఇంకా రాలేదు
- సాగర్ ఆయకట్టు కింద పెసర, కంది సాగు చేసుకోవాలి
- విత్తనాలు, ఎరువులకు కొరత లేదు

సాక్షి ఫోన్ ఇన్‌లో జిల్లా వ్యవసాయ అధికారి(డీఏఓ) శ్రీధర్‌రెడ్డి



ఫోన్ ఇన్ కార్యక్రమంలో రైతులు అడిగిన ప్రశ్నలు విని సమాధానం ఇస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్‌రెడ్డి

సూర్యాపేట: 'వానాకాలం పంటల సాగు మొదలైంది. రైతులు సన్నరకం వరి సాగు చేస్తే లాభదాయకం. మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉండడంతో పాటు ప్రభుత్వం నుంచి బోనస్ అందే అవకాశముంది. బోనస్‌పై మార్గదర్శకాలు రావాల్సి ఉంది. దిగుబడి పెరిగేందుకు భూసార పరీక్షలు చేయించుకోవాలి. అధికారుల సూచనలు పాటించి పంటలు సాగు చేయాలి. జిల్లాలో ఎరువులు, విత్తనాలకు కొరత లేదు' అని జిల్లా వ్యవసాయ అధికారి జి.శ్రీధర్‌రెడ్డి అన్నారు. పంటల సాగులో మెళకువలు, విత్తనాల ఎంపిక తదితర అంశాలపై శనివారం 'సాక్షి' నిర్వహించిన ఫోన్ ఇన్‌కు రైతుల నుంచి అనూహ్య స్పందన వచ్చింది. రైతుల సందేశాలను డీఏఓ నివృత్తి చేశారు.

ప్రశ్న : వానాకాలం పత్తి, వరి సాగు చేయాలనుకుంటున్నాం. ఏఏ రకాలు సాగు చేస్తే అధిక దిగుబడులు వస్తాయి.
- మల్లెపాక యాకయ్య, లక్ష్మాపురం, నాగారం మండలం

డీఏఓ : అధిక సాంద్రత విధానంలో పత్తి సాగు చేయాలి. ఐదారు సాళ్లకు ఒక సాలు కంది సాగు చేస్తే బాగుంటుంది. వరిలో యూనివర్సిటీ వెరైటీలైన బీపీటీ 5204, ఆర్ఎన్ఆర్ 15048, హెచ్ఎంటీ, చింట్లు సాగు చేస్తే దిగుబడి మంచిగా వస్తుంది.

ప్రశ్న : చౌడుపొలంలో ఏ విధమైన పంటలు సాగు చేయాలి. యాసంగి సన్నాలు సాగుచేస్తే దిగుబడి తగ్గింది.
- మల్సూర్ గౌడ్, తాళ్లఖమ్మంపహాడ్, సూర్యాపేట మండలం

డీఏఓ : చౌడుశాతాన్ని తెలుసుకునేందుకు భూసార పరీక్షలు చేయించాలి. మిర్యాలగూడ, కేవీకే గడ్డిపల్లిలో భూసార పరీక్ష కేంద్రాలు అందుబాటులో ఉన్నాయి. చౌడును తగ్గించుకోవాలంటే జీలుగ సాగు చేసి భూమిలోనే కలియదున్నాలి. చౌడుభూముల్లో స్వర్ణ, ఎన్ఎల్ఆర్ 3444 రకాలు బాగుంటాయి.

ప్రశ్న : కొంత చౌడుఉంది. మిల్లర్లు కొనుగోలు చేసేలా ఏరకం సాగు చేయాలి. సన్నరకం వరిని సాగుచేస్తే ఎలా ఉంటుంది. సాగర్ ఆయకట్టులో ఇంకా ఏమైనా పంటలు సాగు చేయొచ్చా.
- బోయిన చినభిక్షు, దాచారం, నేరేడుచర్ల మండలం

డీఏఓ : సన్నరకాలకు మార్కెట్‌లో డిమాండ్ ఉంది. చౌడుపొలాల్లో స్వర్ణరకం వరి సాగుచేస్తే దిగుబడి వస్తుంది. చాలాకాలం నుంచి మిల్లర్లు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వీటిని కొనుగోలు చేస్తున్నారు. వానాకాలం సాగర్ ఆయకట్టుకు నీళ్లు ఎప్పుడైనా రావచ్చు. పెసర, కంది సాగు చేస్తే నీళ్ల ఆలస్యంగా వదిలితే 70 నుంచి 80 రోజుల్లోనే ఆయా పంటలు చేతికి వస్తాయి. లేదంటే భూమిలో కలియదున్నితే బాగుంటుంది. ఆముదం పంటను కూడా సాగు చేయొచ్చు.

ప్రశ్న : ఇటీవలనే తండ్రి పేరుమీది నుంచి భూమిని పట్టా చేయించుకున్నా. రైతుబంధు రావడం లేదు. ఏం చేయాలి.
- కె.నరేష్, జాజిరెడ్డిగూడెం

డీఏఓ : కొత్తగా పాస్ పుస్తకాలు వచ్చిన రైతులు ఏఈఓలను సంప్రదించాలి. వివరాలు అందించాలి. ప్రభుత్వం కొత్తవారికి వర్తింపజేయాలనుకుంటే వివరాలను రైతుబంధు పోర్టల్‌లో ఏఈఓలు నమోదు చేస్తారు. అప్పుడే రైతుబంధు వస్తుంది.

ప్రశ్న : జీలుగ ఎన్నిరోజులకు కలియదున్నాలి. మొదటి వర్షానికి మొలకెత్తలేదు. మళ్లీ చల్లుకోవాలా?
- జి. రవీందర్, బాలెంల, సూర్యాపేట మండలం

డీఏఓ : జీలుగ విత్తనాలు మొదటి వర్షానికి మొలకెత్తకున్నా విత్తన నష్టం ఉండదు. మళ్లీ వర్షం పడితే మొలకెత్తుతుంది. ఎప్పుడు కలియదున్నినా పర్వాలేదు. ప్రధానంగా పూతదశ 30 నుంచి 40 రోజుల వయస్సులో దున్నితే దిగుబడి బాగుండి ప్రతిఫలం ఉంటుంది.

ప్రశ్న : అధిక సాంద్రత పత్తి విత్తనాలు ఎక్కడ దొరుకుతాయి?
- భూపతి సాగర్, పిన్నాయిపాలెం, సూర్యాపేట మండలం

డీఏఓ : జిల్లాలో 400 ఎకరాల్లో అధిక సాంద్రత పత్తిని సాగు చేయించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. కేవీకే గడ్డిపల్లి ఆధ్వర్యంలో ప్రభుత్వమే ఉచితంగా పత్తి విత్తనాలను అందిస్తుంది. మండల వ్యవసాయ అధికారిని విత్తనాల కోసం సంప్రదించాలి.

ప్రశ్న : సన్నాలు సాగు చేయాలనుకుంటున్నాం. గ్రామంలో అవగాహన కల్పించాలి.
- వగ్గు సైదులు, పిన్నాయిపాలెం,పెన్‌పహాడ్

డీఏఓ : గ్రామంలో సమావేశానికి సిద్ధంగా ఉన్నాం. త్వరలోనే వ్యవసాయ అధికారులు, వ్యవసాయ శాస్త్రవేత్తలతో సమావేశం ఏర్పాటు చేయిస్తాం. సన్నాల సాగుపై అవగాహన కల్పిస్తాం.

ప్రశ్న : జీలుగ విత్తనాలు కావాలి. ఇవే కాకుండా ఇంకేమైనా సాగు చేయొచ్చా?
- పొట్టిపాక సైదులు, రామన్నగూడెం, జాజిరెడ్డిగూడెం

డీఏఓ : మొన్నటి వరకు జీలుగ విత్తనాలు సరఫరా చేశాం. అదనంగా విత్తనాల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. రాగానే రైతులకు సరఫరా చేస్తాం. లేదంటే పెసర సాగు చేసుకోవచ్చు. ముందుగా సాగు చేసుకుంటే పంట చేతికైనా వస్తుంది.

ప్రశ్న : వానాకాలం సన్నరకం వరిని సాగుచేయాలనుకుంటున్నాం. ఎలా ఉంటుంది. ఏయే రకాలు సాగు చేసుకోవాలి. బోనస్ వస్తుందా..?
- మొదిగ కరుణాకర్‌రెడ్డి, పిన్నాయిపాలెం, పెన్‌పహాడ్ మండలం, వెన్న భాస్కర్‌రెడ్డి, కేసారం, సూర్యాపేట మండలం

డీఏఓ : సన్నరకాలకు మార్కెట్‌లో ధర బాగుంది. మిల్లుల వద్ద, ప్రభుత్వ కొనుగోలు సెంటర్ల వద్ద అమ్ముకోవచ్చు. మిల్లుల వద్ద మద్దతు ధరకు మించి ధర పలుకుతోంది. బోనస్ అందే అవకాశముంది. దీనిపై ప్రభుత్వం మార్గదర్శకాలు ఇవ్వలేదు. రైతుల డిమాండ్‌ను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. ప్రధానంగా బీపీటీ, ఆర్ఎన్ఆర్, హెచ్ఎంటీ సాగు చేసుకోవాలి.

మిర్యాలగూడలో గ్యాంగ్‌వార్

- నిత్యం ఏదో ఒక వీధిలో గొడవలు పడుతున్న యువకులు
- గంజాయి మత్తులో వీరంగం సృష్టిస్తున్న వైనం
- భయభ్రాంతులకు గురవుతున్న ప్రజలు

మిర్యాలగూడ అర్బన్: సినిమాల ప్రభావంతో నేటి యువత విలనిజమే హీరోయిజంగా ఫీలవుతున్నారు. దీంతో బయట కూడా సినిమాల్లో లాగా అనుకరిస్తూ పెడదోవ పడుతున్నారు. చిన్నచిన్న గ్యాంగ్‌లు ఏర్పాటు చేసుకుని సెటిల్‌మెంట్లు చేసే స్థాయికి చేరుకుంటున్నారు. బర్త్‌డేలకు కూడా డీజేలు పెట్టి బాణాసంచా కాలుస్తూ ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్నారు. యువత డ్రగ్స్‌కు అలవాటు పడుతూ తమ నిండు జీవితాలను పాడు చేసుకుంటున్నారు. మిర్యాలగూడ పట్టణంలో నిత్యం ఏదో ఒక వీధిలో గ్యాంగ్‌వార్‌లు జరుగుతూనే ఉన్నాయి. ఈ క్రమంలో కొందరు తమ ప్రాణాలను సైతం కోల్పోతున్నారు. చెడు వ్యసనాలకు బానిసలుగా మారి దారి తప్పుతున్న యువతను గాడిలో పెట్టేదెవరు..? అని వారి చేష్టలను చూసిన వారు ప్రశ్నిస్తున్నారు.

మత్తుకు బానిసలుగా మారుతున్నారిలా..

గతంలో ఉమ్మడి కుటుంబాలు ఉండటంతో పిల్లల మానసిక పరిస్థితిని ఎప్పటికప్పుడు ఇంట్లో ఎవరో ఒకరు గుర్తించే అవకాశం ఉండేది. దీంతో ఆ పిల్లాడికి పలు ఉదాహరణలతో మంచి విషయాలపై అవగాహన పెంచేవారు. ఈవిధంగా కుటుంబం నుంచే క్రమశిక్షణ నేర్చుకుని జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించేవారు. కానీ మారిన పరిస్థితుల కారణంగా చిన్న కుటుంబాలు పెరగడం, భార్యాభర్తలు ఇద్దరూ కుటుంబ పోషణ కోసం ఉద్యోగాలు చేస్తుండడంతో పిల్లలను గమనించేవారు లేకుండా పోతున్నారు. దీంతో పిల్లలు ఏం చేస్తున్నారు..? అతడి మానసిక స్థితి ఏవిధంగా ఉంది..? అని పరిశీలించేవారు లేకపోవడంతో ముందుగా స్నేహితులతో సరదాగా సిగరెట్, గుట్కా వంటి వాటికి అలవాటు పడుతూ క్రమంగా గంజాయి తీసుకునే స్థాయికి చేరుకుంటున్నారు. మిర్యాలగూడలో గంజాయికి బానిసైన యువకులు సుమారు 2 వేలకు పైగానే ఉంటారని సమాచారం. తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు తమ పిల్లల మానసికస్థితిని అర్థం చేసుకుని వారికి సరైన దిశానిర్దేశం చేయడం వలన యువత మత్తుకు బానిసలు కాకుండా.. పెడదోవ పట్టకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసులు సూచిస్తున్నారు.

మిర్యాలగూడలో ఇటీవల జరిగిన గ్యాంగ్‌వార్‌లు..

- మిర్యాలగూడ పట్టణంలోని గాంధీ బొమ్మ సమీపంలో ఉన్న వైన్స్ వద్ద ఇటీవల రాత్రి సమయంలో కొందరు యువకులు కలిసి ఓ వ్యక్తిని తీవ్రంగా కొట్టి గాయపర్చారు. దీంతో ఆ యువకుడికి తలకు తీవ్ర గాయమై అపస్మారకస్థితిలోకి వెళ్లడంతో ఆస్పత్రిలో చికిత్స చేయించుకున్నట్లు సమాచారం.
- రెడ్డి కాలనీకి వెళ్లేదారిలో రాత్రి సమయంలో తల్లీకుమార్తె నడుచుకుంటూ వెళ్తుండగా.. మత్తులో ఉన్న యువకులు వెకిలి చేష్టలు చేయడంతో వారు భయాందోళనకు గురై పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఆ యువకులకు కౌన్సెలింగ్ ఇచ్చి పంపించినట్లు తెలిసింది.
- పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదురుగా ఓ వీధిలో గత నెల ఫుట్‌బాల్ ఆటలో తలెత్తిన వివాదంలో రెండు గ్యాంగ్‌ల మధ్య తీవ్రమైన గొడవ జరిగింది. దీంతో ఇరువర్గాలకు చెందిన పది మందిపై పోలీసులు కేసు నమోదు చేసినట్లు సమాచారం.
- పట్టణంలోని తాళ్లగడ్డ, ప్రకాశ్‌నగర్, గాంధీనగర్, బాపూజీనగర్‌లో ప్రతి రోజు ఏదో గొడవ జరుగుతుండగా.. గొడవలు పడిన వారు మత్తులో ఉన్నప్పుడే ఈ సంఘటనలు చోటు చేసుకుంటున్నాయని ఆయా కాలనీల ప్రజలు పేర్కొంటున్నారు.

యువకుడిపై విచక్షణారహితంగా దాడి

మిర్యాలగూడ పట్టణంలోని రిజిస్ట్రేషన్ కార్యాలయం సమీపంలో కొందరు యువకులు వీరంగం సృష్టించారు. వివరాలు.. రిజిస్ట్రేషన్ కార్యాలయం సమీపంలో శుక్రవారం పుట్టిన రోజు వేడుకల్లో ఘర్షణ చెలరేగి ఓ యువకుడిపై మరికొంతమంది యువకులు విచక్షణారహితంగా దాడి చేయడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. దాడికి గురైన యువకుడిని కుటుంబ సభ్యులు ఘటనా స్థలానికి చేరుకుని దాడి చేస్తున్న వారిని చెదరగొట్టడంతో వివాదం సద్దుమణిగింది. ఈ గొడవను కొందరు వీడియో తీసి సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేయడంతో వైరల్‌గా మారింది.



బర్త్‌డే పార్టీలో జరిగిన గొడవలో యువకుడిని చితకబాదుతున్న మరో గ్యాంగ్

గాయాలపాలైన యువకుడు శనివారం జిల్లా ఎస్పీని కలిసి ఫిర్యాదు చేసినట్లు సమాచారం.

పట్టించుకోని పోలీసులు ..

రోజురోజుకు పెరుగుతున్న గ్యాంగ్‌వార్‌లను అరికట్టాల్సిన పోలీసులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. గొడవలకు దిగిన వారిని పోలీస్ స్టేషన్‌కు తీసుకురాగానే పలువురు రాజకీయ నాయకులు జోక్యం చేసుకుని విడిపిస్తుండటంతో సదరు యువకులు మరింత పెట్రేగిపోతున్నారని పట్టణ ప్రజలు పేర్కొంటున్నారు. దీంతో ముందుకుపోతే నుయ్యి.. వెనుకకు పోతే గొయ్యి అన్న చందంగా మారిందని, పోలీసులు కూడా మాకెందుకులే అని పట్టించుకోకుండా ఉంటున్నారని పోలీస్ శాఖ సిబ్బందే చెబుతుండటం విశేషం.

విలువైన జీవితాలను నాశనం చేసుకోవద్దు

యువత క్రమశిక్షణతో తమ చదువులు, కెరియర్‌పై దృష్టి సారిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుంది. తల్లిదండ్రులు తమ పిల్లలను ఓ కంట కనిపెడుతూ ఉండాలి. వారి మానసికస్థితి, వారి ప్రవర్తనను గమనిస్తూ పెడదోవ పట్టినట్లు తెలిస్తే వెంటనే వారికి ఓపికగా కౌన్సెలింగ్ ఇవ్వాలి. అప్పుడే పిల్లలకు మంచి జీవితం ఇచ్చిన వారమవుతాం. యువత చెడుమార్గం పట్టి తమ విలువైన జీవితాలను నాశనం చేసుకోవద్దు.

– రాజశేఖరరాజు, మిర్యాలగూడ డీఎస్పీ

క్లుప్తంగా

గ్లోబల్ రైస్ సమ్మిట్‌లో పాల్గొన్న రైతులు



గ్లోబల్ రైస్ సమ్మిట్‌లో కేవీకే కోఆర్డినేటర్ శ్రీనివాస్, త్రిపురారం మండల రైతులు

త్రిపురారం: హైదరాబాద్‌లోని తాజ్ కృష్ణ హోటల్‌లో శనివారం నిర్వహించిన గ్లోబల్ రైస్ సమ్మిట్–2024లో త్రిపురారం మండలం కంపాసాగర్‌లోని కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే) ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాకు చెందిన రైతులతో పాటు త్రిపురారం మండల రైతులు పాల్గొన్నారు. ఈ సదస్సులో ఇతర దేశాల్లో పండిస్తున్న వరి రకాలు, హైబ్రీడ్ వరి ఉత్పత్తి, వరి సాగులో పోషకాల అభివృద్ధి, వరి ఎగుమతి మరియు దిగుమతిపై రైతులకు అవగాహన కల్పించినట్లు డాక్టర్ శ్రీనివాస్ పేర్కొన్నారు. ఇలాంటి సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సదస్సులో రైతులు సోమయ్య, వీరభద్రరావు, చిరంజీవి, బాషా, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వెల్లంకిని సందర్శించిన విదేశీయులు



వెల్లంకిలో మహిళలతో నికోలే మాక్‌డోనాల్డ్, ఆమె కూతురు కేబ

రామన్నపేట: మండలంలోని వెల్లంకి గ్రామాన్ని శనివారం అమెరికాకు చెందిన సాష్ బ్యాగ్స్ తయారీ సంస్థ చైర్‌పర్సన్ నికోలే మాక్‌డొనాల్డ్, ఆమె కూతురు కేబ సందర్శించారు. గ్రామంలోని శ్రీలక్ష్మి హ్యాండ్లూమ్స్‌కు వెళ్లి అక్కడి చేనేత ఉత్పత్తులను, డిజైన్‌లను పరిశీలించారు. రంగుల అద్దకం, డిజైన్లు వేయడం, నూలు వడకడం, రాట్నంపై దారం పోయడాన్ని తమ కెమెరాలలో బంధించారు. వస్త్రాల డిజైన్లు, నాణ్యతను చూసి మెచ్చుకున్నారు. అక్కడున్న వారితో ఫొటోలు దిగారు. శ్రీలక్ష్మి హ్యాండ్లూమ్స్ నిర్వాహకుడు తూడి మురళీధర్ వారి వెంట ఉన్నారు.

నాలుగు గొర్రెపొట్టేళ్ల అపహరణ

చిలుకూరు: మండల పరిధిలోని దూదియాతండా గ్రామంలో గుర్తుతెలియని వ్యక్తులు శనివారం తెల్లవారుజామున నాలుగు గొర్రెపొట్టేళ్లను అపహరించారు. వివరాలు.. దూదియాతండా గ్రామానికి చెందిన గుగులోతు మంగ్త తన ఇంట్లో ముత్యాలమ్మ పండుగ ఉండడంతో నాలుగు గొర్రె పొట్టేళ్లు తీసుకొచ్చి ఇంటి ఆవరణలో కట్టేశాడు. శనివారం తెల్లవారుజామున గుర్తుతెలియని వ్యక్తులు ఆటోలో వచ్చి గొర్రెపొట్టేళ్లను ఎత్తుకెళ్లారు. చోరీకి గురైన గొర్రెపొట్టేళ్ల విలువ రూ.60వేలు ఉంటుందని, ఈ మేరకు చిలుకూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపాడు.

ఇక్కత్ డూప్లికేట్ చీరలను అరికడతాం

- పేటెంట్ రైట్స్ అధికారి సుభజిత్‌షా

భూదాన్‌పోచంపల్లి: ఇక్కత్ వస్త్రాల డూప్లికేట్‌ను అరికట్టేందుకు తగు చర్యలు తీసుకొంటామని పేటెంట్ రైట్స్ (జియోగ్రాఫికల్ ఇండెక్స్–జీఐ) ప్రాంతీయ కార్యాలయ అధికారి సుభజిత్‌షా అన్నారు. శనివారం ఆయన యాదాద్రి భువనగిరి జిల్లాలోని భూదాన్ పోచంపల్లిని సందర్శించారు. చేనేత గృహాలు, వస్త్ర దుకాణాలను సందర్శించారు. మగ్గాలపై తయారవుతున్న చేనేత వస్త్రాలను పరిశీలించారు. చేనేత కార్మికుల స్థితిగతులు, వారికి లభిస్తున్న కూలి, మార్కెటింగ్ విధానాలను అడిగి తెలుసుకొన్నారు. అనంతరం టై అండ్ డై అసోసియేషన్ భవనంలో చేనేత నాయకులు, కార్మికులతో సమావేశమయ్యారు. ప్రస్తుతం చేనేత పరిశ్రమ ఎదుర్కొంటున్న సవాళ్లు, ఇబ్బందులు, ప్రభుత్వాలు తీసుకోవాల్సిన చర్యలను టై అండ్ డై అసోసియేషన్ అధ్యక్షుడు భారత లవకుమార్ వివరించారు. అలాగే పోచంపల్లి ఇక్కత్ వస్త్రాలు గుజరాత్, రాజస్తాన్, తమిళనాడు లాంటి రాష్ట్రాలలో ప్రింటింగ్ చేసి తక్కువ ధరకు విక్రయిస్తుండటం వల్ల చేనేత కార్మికుల జీవనోపాధిపై తీవ్ర ప్రభావం పడిందని తెలిపారు. పేటెంట్ హక్కు కల్గిన పోచంపల్లి ఇక్కత్ వస్త్రాలను ప్రింటింగ్ చేసే వ్యాపారులపై చట్టరీత్యా తగు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అందుకు ఆయన సానుకూలంగా స్పందిస్తూ జీఐ యాక్టును పటిష్టంగా అమలు చేయడానికి తగు చర్యలు తీసుకొంటామని హామీ ఇచ్చారు. ఈయన వెంట ఎన్‌ఫోర్స్‌మెంట్ కేసుల అడ్వకేట్ జానకి, చేనేత నాయకులు ముస్కూరి నర్సింహ, ఈపూరి ముత్యాలు, సీత సుధాకర్, కుడికాల రాంనర్సింహ, గంజి బాలరాజు ఉన్నారు.



చేనేత నాయకులతో సమావేశమైన సుభజిత్‌షా తదితరులు

జాతీయ రహదారిపై కారు బోల్తా.. ఒకరికి గాయాలు

చౌటుప్పల్: మండల పరిధిలోని తూప్రాన్‌పేట గ్రామ శివారులో విజయవాడ–హైదరాబాద్ హైవేపై శనివారం కారు బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కారు నడుపుతున్న వ్యక్తికి గాయాలయ్యాయి. వివరాలు.. హైదరాబాద్‌కు చెందిన నర్సిరెడ్డి కారులో చౌటుప్పల్ వైపు నుంచి హైదరాబాద్‌కు వెళ్తుండగా.. తూప్రాన్‌పేట శివారులో విజయవాడ–హైదరాబాద్ హైవేపై కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టి అవుతలి వైపు బోల్తా పడింది. దీంతో కారు నడుపుతున్న నర్సిరెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ప్రమాదంతో హైవేపై కొంతసేపు ట్రాఫిక్ జాం అయ్యింది. పెట్రోలింగ్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

నకిలీ ఆధార్‌కార్డులతో బ్యాంక్‌లకు బురిడీ

- లోన్లు తీసుకుని ఎగవేసిన నిందితులు
- ముగ్గురిని అరెస్ట్ చేసిన పోలీసులు
- వివరాలు వెల్లడించిన నల్లగొండ ఎస్పీ చందనాదీప్తి

నల్లగొండ క్రైం: ఇతరుల ఆధార్‌కార్డులను సేకరించి చిరునామాలు మార్చి బ్యాంక్ అధికారులను మోసం చేస్తున్న ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను నల్లగొండ ఎస్పీ చందనాదీప్తి శనివారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. కట్టంగూర్ మండలం కురుమర్తి గ్రామానికి చెందిన కాశమల్ల క్రాంతికుమార్ ఎంబీఏ చదివి స్వయంగా సాఫ్ట్‌వేర్ కంపెనీ నెలకొల్పాడు. హైదరాబాద్‌లోని మణికొండలోని పంచవటి కాలనీలో గల నక్షత్ర అపార్ట్‌మెంట్‌లో ఉంటున్నాడు. నష్టాలు రావడంతో అదే సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగిగా పనిచేస్తున్న సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం ఉస్మాన్‌నగర్ ఎంప్లాయీస్ కాలనీకి చెందిన శివేరు సతీష్‌కు తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాదించవచ్చని చెప్పి అందుకు చేయాల్సిన పనుల గురించి వివరించాడు. అదేవిధంగా తన బాబాయి అయిన నల్లగొండ పట్టణంలోని దేవరకొండ రోడ్డులో చైతన్యపురి కాలనీకి చెందిన కాశమల్ల నాగరాజుకు తెలిసిన వారి ఆధార్ కార్డులు తీసుకొస్తే కొంత డబ్బు ఇస్తామని చెప్పడంతో అందుకు అతడు అంగీకరించి ఆధార్‌కార్డులు సేకరించి ఇచ్చాడు.. ఈ ఆధార్‌కార్డుల సహాయంతో క్రాంతికుమార్ పాన్ కార్డులు, కొత్త సిమ్ కార్డులు తీసుకుని ఫోన్ నంబర్లకు లింక్ చేశాడు. ఫొటోషాప్‌లో ఆధార్‌కార్డులపై చిరునామా మార్చి బ్యాంక్‌లో ఖాతాలు తెరిచారు. బ్యాంక్‌లో పాస్‌పుస్తకాలు, చెక్‌బుక్‌లు, ఏటీఎం కార్డులు తీసుకుని నగదు లావాదేవీలు జరిపి సిబిల్ స్కోర్ పెంచుకుని రుణాలు తీసుకున్నారు. తీసుకున్న రుణం బ్యాంక్‌లకు తిరిగి చెల్లించకుండా మోసం చేసేవారు. ఈ క్రమంలో కొందరు బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు తిప్పర్తిలో వారిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని ఎస్పీ తెలిపారు. నిందితుల నుంచిడి 27 ఆధార్ కార్డులు, రూ.1,32,600, 44 సెల్‌ఫోన్లు, 2 కార్లు, 83 పాన్ కార్డులు, 18 సిమ్ కార్డులు, 92 డెబిట్ కార్డులు, 64 రబ్బర్ స్టాంపులు, 3 ల్యాప్‌టాప్‌లు, ఒక కలర్ ప్రింటర్ స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీపేర్కొన్నారు.

యాదాద్రి ఆలయంలో భక్తుల రద్దీ

- స్వామివారి దర్శనానికి 3గంటల సమయం

యాదగిరిగుట్ట: యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం భక్తుల సందడి నెలకొంది. వేసవి సెలవులు ముగుస్తుండటంతో పాటు రెండో శనివారం కావడంతో స్వామివారిని దర్శించుకునేందుకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. దీంతో స్వామివారి ధర్మ దర్శనానికి సుమారు 3గంటల సమయం పట్టగా.. వీఐపీ దర్శనానికి గంట సమయం పట్టింది. స్వామివారిని 35వేల మందికిపైగా భక్తులు దర్శించుకొని తమ మొక్కులు తీర్చుకున్నారు. వివిధ పూజలతో నిత్యాదాయం రూ.56,14,368 వచ్చినట్లు ఆలయాధికారులు తెలిపారు.



భక్తులతో నిండిపోయిన ఆలయ క్యూకాంప్లెక్స్

ప్రొటోకాల్ కార్యాలయం చెంత వీల్‌చైర్స్..

యాదాద్రి క్షేత్రానికి వచ్చే దివ్యాంగులు, వృద్ధులు, అనారోగ్యంతో నడవలేని స్థితిలో ఉన్న భక్తుల సౌకర్యార్థం బ్యాటరీ వెయికిల్స్‌తో పాటు ప్రొటోకాల్ కార్యాలయం చెంత వీల్‌చైర్స్ అందుబాటులో ఉంచామని ఆలయ ఈఓ భాస్కర్‌రావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వీల్‌చైర్‌ను తీసుకునే భక్తులు వారి సెల్‌ఫోన్ నంబర్, చిరునామా ప్రొటోకాల్ కార్యాలయంలో నమోదు చేసి, ఎలాంటి రుసుము, అడ్వాన్స్ లేకుండా వీల్‌చైర్ పొందవచ్చని తెలిపారు. దర్శనం అనంతరం వీల్‌చైర్‌ను తిరిగి ప్రొటోకాల్ కార్యాలయం వద్ద అప్పగించాలని వెల్లడించారు.

ఓడిపోయినా.. ప్రజల పక్షాన పోరాడుతాం

- గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి

నల్లగొండ టూటౌన్: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో ఓడినా ప్రజల పక్షాన పోరాటం ఆపబోమని బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి అన్నారు. శనివారం నల్లగొండ పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తక్కువ సమయంలో ప్రచారం చేసి దాదాపు 49వేలకు పైగా ఓట్లు సాధించామన్నారు. ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ గణనీయంగా ఓట్ల శాతం పెంచుకుందని అన్నారు. రాష్ట్రంలోని మూడు లోక్‌సభ స్థానాల్లో రెండో స్థానంలో నిలిచినట్లు పేర్కొన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో అనేక విషయాలు ప్రభావం చూపాయని, అధికార పార్టీకి 32 మంది ఎమ్మెల్యేలు, ఐదుగురు ఎంపీలు ఉండడం, అధికారం, డబ్బు వారికి కలిసివచ్చిందన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ బహిరంగంగా డబ్బులు పంపిణీ చేసిన విధానంపై బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు ఈసీకి లేఖ రాశారని, దీనిపై విచారణ జరగాలన్నారు. మాజీ మంత్రి కేటీఆర్ బీజేపీ శ్రేణులకు ఫోన్ చేసి ప్రలోభాలకు గురిచేశారని ఆరోపించారు. గెలిచిన అభ్యర్థి తీన్మార్ మల్లన్నకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈనాడు దినపత్రిక వ్యవస్థాపకుడు రామోజీరావు మృతి పట్ల ప్రగాఢ సంతాపం తెలియజేశారు. సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నాగం వర్షిత్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి మాదగాని శ్రీనివాస్‌గౌడ్, నూకల నరసింహారెడ్డి, వీరెల్లి చంద్రశేఖర్, బండారు ప్రసాద్, పిల్లి రామరాజుయాదవ్, నూకల వెంకట్‌నారాయణరెడ్డి, పోతెపాక సాంబయ్య, కాశమ్మ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రేమేందర్‌రెడ్డి, నాయకులు

డప్పు సుధాకర్‌కు నివాళి

నాగారం : నాగారం మండల కేంద్రానికి చెందిన తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారుడు చిప్పలపల్లి సుధాకర్ అలియాస్ డప్పు సుధాకర్ (38) శుక్రవారం గుండెపోటుతో మృతి చెందాడు. ఈ సందర్భంగా నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, ఆయన సతీమణి వేముల పుష్ప, జెడ్పీటీసీ కడియం ఇందిరాపరమేశ్వర్, ఏపూరి సోమన్న, చుక్క రామనర్సయ్య, గిద్దె రామనర్సయ్యలు శనివారం డప్పు సుధాకర్ భౌతికకాయాన్ని సందర్శించి, మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎమ్మెల్యే వేముల వీరేశం రూ.20,000, జెడ్పీటీసీ ఇందిరాపరమేశ్వర్ రూ.10,000 ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో తెలంగాణ సాంస్కృతిక సారథి సభ్యులు, కళాకారులు తదితరులు పాల్గొన్నారు.



నాగారంలో చిప్పలపల్లి సుధాకర్ మృతదేహానికి నివాళులర్పిస్తున్న నకిరేకల్ ఎమ్మెల్యే వీరేశం

బాసర ట్రిపుల్ ఐటీ పిలుస్తోంది..!

- ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం
- ఈ నెల 22 వరకు అప్లై చేసుకునేందుకు అవకాశం
- ఎంపికైన విద్యార్థుల జాబితా జూలై 3వ తేదీన విడుదల



బాసరలోని ట్రిపుల్ ఐటీ భవనం

పెద్దవూర: పదో తరగతి పూర్తయిన విద్యార్థులు బాసర ట్రిపుల్ ఐటీలో చదివి తమ భవిష్యత్తుకు బంగారం బాటలు వేసుకోవాలని కలలు కంటుంటారు. తెలంగాణ రాష్ట్రం నిర్మల్ జిల్లా బాసరలో గల ట్రిపుల్ ఐటీలో(రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వ విద్యాలయం) 2024–25 విద్యాసంవత్సరానికి గాను ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల అయ్యింది. ఆరేళ్ల బీటెక్ సమీకృత కోర్సులో చేరేందుకు అర్హులైన విద్యార్థుల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. పదో తరగతిలో విద్యార్థులు సాధించిన జీపీఏ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు.

అర్హతలు ఇవీ..

దరఖాస్తు చేసుకోవాలనుకునే విద్యార్థులు ఈ ఏడాది నిర్వహించిన ఎస్‌ఎస్‌సీ(పదో తరగతి), తత్సమాన పరీక్షల్లో రాష్ట్రంలోని ప్రభుత్వ గుర్తింపు పొందిన ఏదైనా పాఠశాల నుంచి రెగ్యులర్‌గా ఉత్తీర్ణులై ఉండాలి. 2024 జూన్ 1వ తేదీ నాటికి 18 ఏళ్లు నిండకూడదు. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 21 ఏళ్లు నిండకూడదు. ట్రిపుల్ ఐటీలో మొత్తం 1500 సీట్లకు గాను 85శాతం సీట్లు తెలంగాణ రాష్ట్రవాసులకే కేటాయించారు. మిగతా 15శాతం సీట్లు ఓపెన్ కేటగిరీలో తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన మెరిట్ విద్యార్థులకు ప్రవేశం కల్పించనున్నారు.

రిజర్వేషన్లు ఇలా..

- ఎస్సీలకు 15శాతం, ఎస్టీలకు 6శాతం, బీసీ–ఏ 7శాతం, బీసీ–బీ 10శాతం, బీసీ–సీ 1శాతం, బీసీ–డీ 7శాతం, బీసీ–ఈ 4శాతం.
- ప్రత్యేక కేటగిరీలో దివ్యాంగులకు 3శాతం, ఈడబ్ల్యూఎస్ కోటా కింద 10 శాతం, సైనికోద్యోగుల పిల్లలకు 1శాతం, స్పోర్ట్స్ కోటా కింద 0.5శాతం భర్తీ చేస్తారు.
- రెండు తెలుగు రాష్ట్రాల విద్యార్థులకు కాకుండా వేరే రాష్ట్రాల వారికి, భారతీయ పౌరసత్వం కలిగిన అంతర్జాతీయ విద్యార్థులకు, గల్ఫ్ దేశాల్లో పనిచేస్తున్న భారతీయుల పిల్లలకు అదనపు సీట్లు కేటాయిస్తారు.
- అన్ని విభాగాల్లో బాలికలకు 33.33శాతం ప్రవేశాల్లో రిజర్వేషన్ కల్పిస్తారు.

ప్రవేశ విధానం..

పదో తరగతిలో గ్రేడ్ పాయింట్ ఏవరేజ్(జీపీఏ) ఆధారంగా మెరిట్ పద్ధతిలో ప్రవేశాలు కల్పిస్తారు. ప్రభుత్వం, నాన్ రెసిడెన్షియల్ పాఠశాలలు, ఇతర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలలో చదివిన విద్యార్థులకు వెనుకబాటు సూచిక కింద 0.4 పాయింట్లను పదో తరగతి గ్రేడ్ పాయింట్లకు జత కలిపి ప్రవేశాల్లో ప్రాధాన్యత కల్పిస్తారు.

గ్రేడ్ పాయింట్లు సమానమైతే....

సీట్ల కేటాయింపు సందర్భంలో సమాన గ్రేడు పాయింట్లు ఉన్నట్లయితే విద్యార్థులకు సబ్జెక్టుల వారీగా పొందిన గ్రేడ్ ఆధారంగా ప్రవేశాలు ఉంటాయి. అనగా మొదట గణితం, తర్వాత జనరల్ సైన్స్, ఆ తర్వాత ఇంగ్లిష్, ఆ తర్వాత సోషల్ స్టడీస్‌లో ఎక్కువ గ్రేడ్ వచ్చిన వారికి ప్రాధాన్యం ఇస్తారు. ఇవన్నీ సమానంగా ఉంటే ఫస్ట్ లాంగ్వేజీలో సాధించిన మార్కులను పరిగణలోకి తీసుకుంటారు. రాష్ట్రపతి ఉత్తర్వులు 371 ఆర్టికల్–డీ, సెక్షన్–95/2014 మేరకు ఈ నిర్ణయం తీసుకున్నారు. అయినా గ్రేడ్ పాయింట్లు సమానమైతే విద్యార్థి పుట్టిన తేదీ ప్రకారం పెద్ద వయస్సు ఉన్నవారికి అవకాశం ఇస్తారు. ఇవి సమానంగా ఉంటే హాల్‌టికెట్ నంబర్‌ను పరిగణలోకి తీసుకుని ఎంపిక చేస్తారు.

దరఖాస్తు చేసుకునే విధానం..

- అర్హులైన వారు ఆన్‌లైన్ ద్వారా మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి.
- ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రూ.400, ఓసీ, బీసీ విద్యార్థులకు రూ.500, ఇతర రాష్ట్రాల విద్యార్థులకు రూ.1500, ఎన్‌ఆర్‌ఐ విద్యార్థులకు 100 యూఎస్ డాలర్లు ప్రవేశ రుసుం చెల్లించాల్సి ఉంటుంది.

ఫీజుల వివరాలు..

- ప్రవేశం పొందిన విద్యార్థులు ట్రిపుల్ ఐటీలో ఆరేళ్లు విద్యనభ్యసించాల్సి ఉంటుంది. ఇందులో ఇంజినీరింగ్ సంబంధించిన అన్ని కోర్సులు ఉంటాయి.
- మొదటి రెండేళ్లు ఏడాదికి రూ.36 వేలు, ఆ తర్వాత నాలుగేళ్లు ఏడాదికి రూ.40వేల చొప్పున చెల్లించాల్సి ఉంటుంది.
- ప్రభుత్వం చెల్లించే ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకానికి అర్హులైన విద్యార్థులు మాత్రం ఎలాంటి ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదు.
- రీయింబర్స్‌మెంట్ వర్తించని విద్యార్థులు మాత్రం మొత్తం ఫీజు చెల్లించాల్సి ఉంటుంది.
- రిజిస్ట్రేషన్ ఫీజు ఓసీ, బీసీ అభ్యర్థులు రూ.1000, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.500 చెల్లించాలి.
- క్యాష్ డిపాజిట్ కింద ఏ కేటగిరీ అభ్యర్థులైనా రూ.2000 చెల్లించాలి. దీనిని తిరిగి ఇస్తారు.
- పరీక్ష రుసుము రూ.1000, వైద్య బీమా రూ.500 చెల్లించాలి.
- మొదటి రెండు సంవత్సరాలకు సుమారుగా సంవత్సరానికి అడ్మిషన్ సమయంలో మొత్తం రూ.3700(ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.3200) చెల్లించాల్సి ఉంటుంది.
- ఇలాంటి వారికి యూనివర్సిటీ బ్యాంకు నుంచి రుణ సదుపాయం కల్పించనుంది.
- ఇతర రాష్ట్రాలు, గల్ఫ్ దేశాల్లో పనిచేసే వారి పిల్లలు ఏడాదికి రూ.1.37 లక్షలు, ఎన్నారై విద్యార్థులు రూ.3,01,000 ట్యూషన్ ఫీజు చెల్లించాలి.

అన్నీ ఉచితమే..

ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకానికి అర్హులైన విద్యార్థులకు ప్రభుత్వమే అన్నీ ఉచితంగా అందజేస్తుంది. ఆరు సంవత్సరాల పాటు ల్యాప్‌ట్యాప్, మూడు జతల షూలు, హాస్టల్‌లో అవసరమైన అన్నింటినీ ప్రభుత్వమే సమకూర్చుతుంది.

కౌన్సిలింగ్‌లో సమర్పించాల్సిన ధ్రువపత్రాలు

ఎంపికైన విద్యార్థులు కౌన్సిలింగ్‌కు వచ్చేటప్పుడు దరఖాస్తు చేసుకున్న సమయంలో పేర్కొన్న పత్రాలన్నింటినీ దగ్గర ఉంచుకోవాలి. ఆన్‌లైన్ దరఖాస్తు ఫాం ప్రింట్ అవుట్, దరఖాస్తు చేసుకున్న రశీదు, పదో తరగతి హాల్‌టికెట్, మార్కుల షీట్, రెసిడెన్షియల్ సర్టిఫికెట్, బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు కుల ధ్రువీకరణ పత్రాలు, వికలాంగులైతే వైకల్య ధ్రువీకరణ పత్రం, సైనికోద్యోగుల పిల్లలు సంబంధిత అధికారి జారీ చేసిన ధ్రువీకరణ పత్రం, ఈడబ్ల్యూఎస్ కోటా కింద అప్లై చేసే విద్యార్థులు ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్, ఎన్‌సీసీ, స్పోర్ట్స్ కోటా విద్యార్థులు సంబంధిత అధికారి జారీ చేసిన ధ్రువీకరణ పత్రాలు సమర్పించాలి.

ఎంపికైన అభ్యర్థులకు సమాచారం

కౌన్సిలింగ్‌కు ఎంపికైన విద్యార్థుల జాబితా యూనివర్సిటీ వెబ్‌సైట్ www.rgukt.ac.inలో ఉంచుతారు.

ముఖ్యమైన తేదీలు

- దరఖాస్తుల ప్రారంభం : 01-06-2024
- దరఖాస్తుల స్వీకరణకు చివరితేదీ: 26-06-2024
- ఎంపికైన వారి జాబితా ప్రకటన: 03-07-2024
- సర్టిఫికెట్ల పరిశీలన: 08-07-2024 నుంచి 10-07-2024 వరకు
- కళాశాలలో రిపోర్టింగ్ : 01-07-2023